క్లుప్తంగా

అపెక్స్ కమిటీ సభ్యురాలిగా గీతాశ్రీకాంత్



గీతాశ్రీకాంత్‌ను అభినందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రస్ట్ అపెక్స్ కమిటీ సభ్యురాలిగా యార్లగడ్డ గీతా శ్రీకాంత్‌ను నియమించినట్లు డాక్టర్ కె.అమ్మన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రవిశంకర్ గురూజీ స్థాపించిన ఈ స్వచ్ఛంద సంస్థ ఆధ్యాత్మికతతో పాటు ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ అపెక్స్ కమిటీ సభ్యురాలిగా నియమించడమే కాకుండా ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ హ్యూమన్ వాల్యూస్(ఐఏహెచ్‌వీ) బాధ్యతలు కూడా అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

శిష్టకరణాల భవనానికి కుర్చీల వితరణ



కుర్చీలు అందిస్తున్న కనకరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహాలక్ష్మినగర్‌కాలనీలో నిర్మించిన శిష్టకరణ కమ్యూనిటీ హాల్‌కు 50 స్టీల్ కుర్చీలు, భవన నిర్మాణానికి మొత్తం రూ.లక్ష వరకు సాయం అందించినట్లు రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరికతోట కనకరాజు, ఉమ తెలిపారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలోసంఘం నగర కమిటీ ప్రతినిధులు జి.వినోద్, ఆర్.వి.ఎన్.శర్మ, గోకుల్ విజయ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 11 నుంచి చండీయాగం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో ఏప్రిల్ 11 నుంచి 13 వరకు వసంత నవరాత్రి పర్వదినాల సందర్భంగా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ మునగవలస సుకన్య, అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సహస్ర ఘటాభిషేకం, పంచాయతన యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూలమూర్తికి సహస్ర ఘటాలతో అభిషేకాలు, మహా పూర్ణాహుతి నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

మోడల్ స్కూల్ వసతి గృహం తనిఖీ



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జీసీడీఓ నీరజ

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్లో ఉన్న బాలికల వసతి గృహాన్ని జీసీడీఓ సింహాద్రి నీరజ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అమలు చేస్తున్న మెనూ, సిబ్బంది హాజరు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం అధికారి కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా డీకేవీడీఆర్ఎస్



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగన్ కౌశల్ వికాస్ దివ్యాంగన్ రోజ్‌గార్ సేతు(డీకేవీడీఆర్ఎస్) పథకాలు దివ్యాంగులకు అండగా నిలుస్తాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం న్యాయసేవా సదన్‌లో పథకాలపై దివ్యాంగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు, డిసేబులిటీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత, దివ్యాంగుల సంక్షేమ ప్రతినిధి నర్మద, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు

సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి

ఎచ్చెర్ల క్యాంపస్ : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ అన్నారు. నూజివీడు ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో శనివారం శ్రీకాకుళం ఇంజినీరింగ్ కాలేజీలో హైదరాబాద్ ఐఐటీ ఆధ్వర్యంలో టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్ అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రోన్ ఇవిష్కరణలు, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. క్యాంపస్‌లో డ్రోన్ క్లబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జీయూకేటీ అధికారులు, ఫ్యాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



రణస్థలంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/రణస్థలం/జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండలం తోటపాలెం కూడలిలోని ఫంక్షన్ హాలులో శనివారం సచివాలయ కన్వీనర్లు, బూత్ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరిందని, వారంతా పార్టీకి ఓటు వేసేలా చొరవ తీసుకోవాలన్నారు. గత టీడీపీ పాలన, జన్మభూమి కమిటీల ఆరాచకం, అప్పటి నాయకులు అవినీతి, హామీల పేరిట చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామ సచివాలయం యూనిట్‌గా కనీసం 60శాతం ఓట్లు లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అయితేనే ప్రభుత్వ పథకాలు నిరాటంకంగా కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పార్టీ కన్వీనర్ ముద్దాడ శంకరరావు, మండల సచివాలయ కన్వీనర్ మూగి శ్రీరాములు, నాయకులు దుంప చిన్నారెడ్డి, శీరపు శ్రీరాంమూర్తి, బగ్గు రాజారావు, పైడి త్రీమూర్తులు, బొడ్డేపల్లి సుధాకర్, బెండు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా చేయాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే కిరణ్ కుమార్ అన్నారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సమాశం నిర్వహించి దిశా నిర్దేశంచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరత్నం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజల్లోకి పథకాలు తీసుకెళ్లాలి..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం లావేరు గ్రామంలో కల్యాణ మండపంలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో బూత్ ప్రెసిడెంట్‌లతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొంతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనమంతా జగనన్న సైనికులం

జగనన్న గెలుపునకు మనమంతా సైనికుల్లా పని చేద్దామని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జి.సిగడాంలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, మండల బూత్ కన్వీనర్ ఆబోతుల జగన్నాథం, జేఎస్ఏ కన్వీనర్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు వాన ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, తిరుమరెడ్డి గౌరీశంకరరావు, నాయకులు మామిడి బలరాం, పేడాడ శ్రీరామమూర్తి, పిల్లల శివకుమార్, ముద్దాడ గౌరీ, చందక సతీష్, తొత్తడి రామారావు, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, బొల్లా జనార్దనరావు, ఈ.గోవిందరావు, పున్నాన అక్కలనాయుడు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రమేష్‌నాయుడు, వెలిది సాయిరాం, నారాయణరావు, అప్పారావు, చిక్కాల ధర్మారావు పాల్గొన్నారు.



జి.సిగడాం: ఎన్నికలకు సిద్ధమంటూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే, కార్యకర్తలు

టీడీపీ హయాంలో అనర్హుల చేతికి ప్రభుత్వ భూమి

- ఆ భూమిని అర్హులకు ఇచ్చేందుకు ప్రయత్నించడం నేరమా?
- విలేకరుల సమావేశంలో ఎంపీపీ గొండు రఘురాం



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్, ప్రజాప్రతినిధులు

గార: టీడీపీ ప్రభుత్వ హయాంలో అనర్హుల చేతికి ప్రభుత్వ భూమి అందించి పేదలకు అన్యాయం చేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పేదలకు భూములు అందించేందుకు కృషి చేస్తున్నామని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోనంగి పంచాయతీలో అనర్హులైన టీడీపీ నాయకుల కుటుంబం నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని అర్హులైన రైతులకు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. దీనిపై గ్రామసభ తీర్మానం చేసి ఉన్నతాధికారులు నివేదించామని తెలిపారు. ఇంకా అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరగలేదని స్పష్టం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే అధ్యక్షతన అసైన్‌మెంట్ కమిటీ తోనంగిలో అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగి బొణికల వేణుగోపాల్ (రిటైర్డు ఉపాధ్యాయుడు) కుటుంబ సభ్యులు, బంధువులకు ఏకంగా 20 ఎకరాలు (సర్వే నెంబర్లు 172లో 1, 172లో 2, 172లో 3) ప్రభుత్వ భూమిని మంజూరు చేశారని, ఇది పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని వివరించారు. అక్రమంగా వచ్చిన భూమి ద్వారా ట్రిమెక్స్ ఇసుక పరిశ్రమకు స్థలం లీజుకు ఇచ్చి ఏకంగా రూ.కోటి ఆదాయాన్ని ఆ టీడీపీ కుటుంబం పొందిందని ఆరోపించారు. మంజూరైన భూమిలో 4ఎకరాల 50 సెంట్లను ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. తోనంగిలో ఒక్క టీడీపీ నాయకుల కుటుంబమే పేదలుగా గుర్తించారని, మిగతా వారెవ్వరూ పేదలు కాదన్నది టీడీపీ సిద్ధాంతమని దుయ్యబట్టారు. పేదల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని, మరోవైపు తోనంగిలో అక్రమంగా ప్రభుత్వం నుంచి తీసుకున్న భూమిని పేదలకు పంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీస గోవిందరాజులు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, తోనంగి లక్ష్మణ, వమరవల్లి ఉదయ భాస్కరరావు, తెనుకోటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓడీల జారీలో జాప్యం



డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అందజేసే ఓడీ (ఒరిజనల్ డిగ్రీ సర్టిఫికెట్లు) జారీలో తీవ్ర జాప్యమవుతోందని విద్యార్థులు డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నెలలో ప్రతి మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఫోన్ చేసి సమస్యలు చెప్పారు. అధికారులు సమాధానాలు చెప్పారు. వర్సిటీలో ఓడీల జారీలో జాప్యమవుతోందని, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఇంకా జాప్యం చేస్తున్నారని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య స్పందిస్తూ ప్రస్తుతం ఓడీలు జారీ నేషనల్ అకడమిక్ డిపోజిట్ విధానం అమలు చేసి, డిజిటల్ లాకర్ సిస్టంలో అందజేస్తున్నట్లు చెప్పారు. కొత్త విధానం కావటం వల్ల కొంత జాప్యం జరుగుతోందన్నారు. డిగ్రీ ఇయర్ ఎండ్‌కు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కొందరు కోరారు. డిగ్రీ 4, ఆరో సెమిస్టర్ పరీక్షలపై విద్యార్థులు ప్రశ్నించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై విద్యార్థులు ప్రశ్నించగా, ఏప్రిల్ మూడో వారంలో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. రీవాల్యుయేషన్ ఫలితాల్లో తీవ్ర జాప్యం అవుతోందని కొందరు ప్రశించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ పీలా సుజాతతో కూడిన అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేసిన కృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న చక్రవర్తి

అరసవిల్లి: ప్రత్యక్ష దైవం అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాలకు చెందిన బి.నారాయణరెడ్డి, నాగసుబ్బమ్మ దంపతుల తరఫున రూ.లక్ష విరాళాన్ని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ ఎం.కృష్ణారెడ్డి శనివారం అందజేశారు. ఈ మేరకు విరాళ చెక్కును సీనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తికి అందజేశారు. అనంతరం ఆదిత్యుని ప్రత్యేక దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పీఆర్ ఇంజినీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ఆదిత్యుని దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ప్రధాన అర్చకుల ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఎం.రమేష్, జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. సింహాచలం దేవస్థానం ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి కూడా ఆదిత్యుని దర్శించుకున్నారు.

48 గంటల్లో కారుణ్య నియామకం



కారుణ్య నియామక పత్రాన్ని అందిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కె.వెంకటరావు అటెండర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య జె.దుర్గమ్మ కారుణ్య నియామకానికి ఫిబ్రవరి 29న దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కమిషనర్ తమీమ్ అన్సారియా దృష్టికి మున్సిపల్ ఇంజినీర్ పి.సుగుణాకరరావు తీసుకెళ్లగా వెంటనే స్పందించి 48గంటల్లో కారుణ్య నియామక పత్రాన్ని అందించారు. ఉద్యోగుల, ప్రజా సమస్యలపై వెనువెంటనే స్పందించి మానవత్వం చాటుకున్న కమిషనర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఎంఈ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ ఫెస్ట్‌లో 132 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌ఫెస్ట్-2024కు విశేష స్పందన లభించింది. వివిధ కళాశాలకు చెందిన దాదాపు 550 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ కంపెనీలకు 132 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ వై.మణికుమార్, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పోలినాయుడు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఈఆర్‌వో లక్ష్మణమూర్తి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను మండల స్థాయి అధికారులు విధిగా పరిశీలించాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.లక్ష్మణమూర్తి సూచించారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో జె.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సైలు, వైద్యాధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కోదండరాముడికి పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: లక్ష్మిడిపేటలో కోదండ రామస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని లంకాం పంచాయతీ మాతికపేటలో సీసీ రోడ్డు పనులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.10లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు బూటకపు హామీలతో మోసగించే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఏ ప్రభుత్వంలో లబ్ధి పొందారో వారికే పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, సర్పంచ్‌లు చిట్టి రవికుమార్, గేదెల చెంగల్వరావు, విశ్వనాథం పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన



ఎచ్చెర్ల మండలం జరజాంలో ముసాయిదా జాబితా పరిశీలిస్తున్న ఏఓ సురేష్



శ్రీకాకుళం రూరల్: ఆర్‌బీకేలో జాబితాను పరిశీలిస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్, రబీలకు సంబంధించి పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు పక్కాగా అమలు చేస్తున్నట్లు ఎచ్చెర్ల వ్యవసాయాధికారి వై.సురేష్ తెలిపారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రబీ సాగు 2023-24కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన ఈ-క్రాఫ్ ముసాయిదా జాబితాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా ముసాయిదా జాబితా పరిశీలించాలని, అభ్యంతరాలుంటే ఈ నెల 5లోపు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. శతశాతం ఈ క్రాప్ నమోదు, పంటల కొనుగోలు లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

శ్రీకాకుళం రూరల్: 2023-24 రబీ పంటల నమోదు, ఈ-క్రాప్, ఈకేవైసీల ముసాయిదా జాబితాలను శనివారం గూడేం, సానివాడ ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి తెలిపారు. మండల పరిధిలోని 92 శాతం ఈకేవైసీ, వంద శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. ఈ నెల 8న తుదిజాబితా విడుదల చేస్తామన్నారు.

రణస్థలం: సామాజిక తనిఖీలో భాగంగా రబీ 2023-24 సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి డి.విజయ భాస్కర్ తెలిపారు. జే.ఆర్.పురం-2 రైతు భరోసా కేంద్రంలో శనివారం ఈ క్రాప్ జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వీఆర్వో లుకలాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: రైతులు ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించాలని వ్యవసాయాధికారి యర్రా శారద అన్నారు. శనివారం మర్రివలస, సంతవురిటి, ఆనందపురం గ్రామాల్లో ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచుచ్ బుడారి లక్ష్మణరావు, విక్రం కోటి, చిత్తిరి మంజు, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శ్రీనివాసరావుకు సత్కారం



పోతిన శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పోతిన శ్రీనివాసరావు శనివారం తొలిసారిగా జిల్లాకు రావడంతో ఆయనను లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్ వద్ద పలువురు డైరెక్టర్లు, నగరాల సంఘం నాయకులు, వైఎస్సార్ సీపీ నేతలు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, పిల్ల ఆనందరావు, హనుమంతురావు, రమేష్, రాజగోపాల్, రవిశంకర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని బీఆర్‌ఆర్ వంశధార కార్యాలయ పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు అన్నారు. పీఎన్ కాలనీ జీరోలైన్ మున్సిపల్ కార్పొరేషన్ పార్కులో 1987 పతాంజలి యోగా విద్యాకేంద్రం ఆధ్వర్యంలో మాఘమాసం నేపథ్యంలో మహిళలు సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో యోగా కేంద్రం నిర్వాహకులు పాగిరి సుగుణాకరరావు, యోగాచార్యులు రామారావు, నాగలక్ష్మీ, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు, దుంగ రమణమూర్తి, నరసింహమూర్తి, తంగిస్వాతి, యోగా టీచర్ కిరణ్‌కుమార్, పాండ్రంగి మురళీకృష్ణ, కొంక్యాన మురళీధర్, లక్ష్మీగాయత్రి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో గదుల కేటాయింపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని వైఎస్సార్ స్మారక పురుషుల వసతి గృహంలో శనివారం సీట్లు కేటాయించారు. ముందుగా అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 90 గదులు ఉండగా, ఇంజినీరింగ్, సైన్స్ విభాగాలకు చెందిన 360 మంది విద్యార్థులకు గదులు కేటాయించారు. ఒక్కో గదిని నలుగురికి కేటాయించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, మహిళల వసతి గృహం చీఫ్ వార్డిన్ డాక్టర్ ఎస్.లోకేశ్వరి, వసతి గృహ మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి నేతాలమ్మ తల్లి యాత్ర



జి.సిగడాం: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి నేతాలమ్మ తల్లి యాత్ర మహోత్సవాలు ఆదివారం నుంచి వాండ్రంగి గ్రామంలో ప్రారంభం కానున్నాయి. మార్చి 5 వరకు జరిగే ఉత్సవాల్లో అమ్మవారికి ప్రతిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 3న సీతారామ కల్యాణం, 4న ఢీ జోడీ డ్యాన్స్ హంగామా, 5న రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకం తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్ఎల్ఎంను వినియోగించుకోవాలి



చిన్నారావు, యోగేశ్వరరావులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గొర్రెలు, మేకల పెంపకందారులను జిల్లాలో మరింత బలోపేతం చేస్తామని గొర్రెలు, మేకలపెంపకందారుల సహకార సంఘం చైర్మన్ రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో సంఘ చైర్మన్ చిన్నారావు, నూతనంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావులను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం)ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ ఎం.కిషోర్, శ్రీకాకుళం డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.జగన్నాథం, పీటీ మనోజ్‌కుమార్, కంచరాన రాజగోపాలరావు, పి.చంద్రశేఖర్, పి.ఎస్.జి.బాలకృష్ణ, డి.శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 293వ కార్యక్రమంలో భాగంగా శనివారం మెహర్ ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నృత్య దర్శకులు మెహర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అనూరాధ, వాసంతి, కిల్లీ పరిమళ బృందం ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్రం యూత్ కోఆర్డినేటర్ కె.వి.ఉజ్వల్, మెహర్ విద్యామందిర్ కరస్పాండెంట్ వి.కామేశ్వరరావు, సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్య నిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, కార్యదర్శి బి.రామచంద్రదేవ్, పొట్నూరు వెంకటరావు, రమణారావు, పైడి సత్యవతి, కంచరాన అప్పారావు పాల్గొన్నారు.